క్లుప్తంగా

పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ



పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కాంతమ్మ

రోలుగుంట: వెదుళ్లవలస రెవెన్యూలో భూరీసర్వే పూర్తయిన నేపథ్యంలో రైతులకు గురువారం సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మ పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వాలు చేయని సాహసాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేసి చూపించారన్నారు. దీనివల్ల దీర్ఘకాలిక భూసమస్యలు తీరడంతోపాటు రైతులకు ఎంతో మేలు కలిగిందన్నారు. కార్యాలయాల చుట్టూ తిరగకుండా రెవెన్యూ అధికారులే తమకు ఫోన్ చేసి భూములు సర్వే చేసి, పాస్ పుస్తకాలివ్వడం ఎంతో ఆనందంగా ఉందని రైతులు తెలిపారు.

జెడ్పీటీసీ రమణమ్మకు ప్రభుత్వ విప్ పరామర్శ



రమణమ్మ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న ధర్మశ్రీ

రావికమతం: కొత్తకోటలో జెడ్పీటీసీ సభ్యురాలు తలారి రమణమ్మఆదిమూర్తిని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ గురువారం పరామర్శించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలో చికిత్స పొంది ఇటీవల ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొత్తకోట శివాలయం కమిటీ చైర్మన్ గుమ్ముడు దొరబాబు ఇంట్లో శుభకార్యానికి హాజరయ్యారు. ఎంపీపీ పైల రాజు, నాయకులు పాల్గొన్నారు.

గర్నికంలో 86 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి దుర్గాప్రసాద్

రావికమతం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీ పరిధి గర్నికం గ్రామ సచివాలయంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో మంచం పట్టిన రోగులు లేరని నిర్ధారించుకున్న తర్వాత గ్రామ సచివాలయంలో 86 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

స్నేహితురాలికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న దొరబాబు

గొలుగొండ: తనతో కలసి చదువుకున్న స్నేహితురాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న మరో స్నేహితుడు తన మానవత్వం చాటుకున్నాడు. నర్సీపట్నానికి చెందిన ఏఎన్ఎస్‌జీ దొరబాబు కృష్ణదేవిపేట హైస్కూలులో 1995లో పదో తరగతి చదివాడు. అక్కడే తనతోపాటు చదువుకున్న స్థానిక గ్రామానికి చెందిన కయ్యం శ్రీలక్ష్మి ఇటీవల ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్నాడు. గురువారం కృష్ణదేవిపేటలో ఆమె ఇంటికి వెళ్లి రూ.10 వేలు అందజేశాడు.

మిద్దె పంటలపై అవగాహన రేపు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం గౌరీగ్రంథాలయం హాల్లో శనివారం సాయంత్రం 5 గంటలకు మేడలపై కూరగాయలు–తోటల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బయోటెక్నాలజీ శాస్త్రవేత్త డాక్టర్ కె.జయచంద్ర విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. మిద్దె పంటల సాగుపై ఆసక్తి ఉన్న వారు హాజరుకావాల్సిందిగా కోరారు.

గాదిరాయి.. అభివృద్ధి చూడవోయి

- రూ. 90 లక్షలతో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు
- రూ. 90 లక్షలతో బీటీరోడ్డు నిర్మాణం
- రూ 1.20 కోట్లతో హైస్కూల్‌లో నాడు – నేడు పనులు

నియోజకవర్గం - మాడుగుల

మండలం	- మాడుగుల
సచివాలయం	- జేడీపేట
గ్రామం	- గాదిరాయి
వార్డులు	-10
జనాభా	- 2,041
ఓటర్లు	- 1,287
ప్రతి నెలా వైఎస్సార్ కానుక పింఛన్ల పంపిణీ సంఖ్య	-368



గ్రామంలో నిర్మించిన సీసీరోడ్డు



జగనన్న కాలనీలో పూర్తయిన ఇల్లు



గాదిరాయి నుంచి ఎం. కృష్ణాపురం వరకు వేసిన బీటీరోడ్డు

మాడుగుల: మండలంలో అతి చిన్న గ్రామం గాదిరాయి. ఇప్పుడీ గ్రామం అభివృద్ధి బాటలో పరుగులు తీస్తోంది. ఒకప్పుడు చాలీచాలని తరగతి గదులతో హైస్కూలు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, ఇప్పుడు నాడు – నేడు నుంచి రూ.1.20 కోట్లతో అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నారు. దాదాపు పనులు పూర్తి కావస్తున్నాయి. వచ్చే సంవత్సరంలోగా విద్యార్థులకు కొత్త భవనాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రాథమిక పాఠశాలలో నాడు – నేడులో భాగంగా రూ. 26 లక్షలతో రూపురేఖలు మార్చారు. సరైన రోడ్డు రవాణా వ్యవస్థ లేక గ్రామస్తులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యేవారు. గతుకుల రోడ్డు దుస్థితిపై గత టీడీపీ పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ పాలనలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో గాదిరాయి నుంచి ఎం. కృష్ణాపురం వరకు రూ.90 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించారు. రూ.90 లక్షలతో ఇంటింటికీ కుళాయిలు, రూ.30 లక్షలతో సీసీరోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేశారు. జగనన్న కాలనీలో ఆకర్షణీయమైన రీతిలో 13 ఇళ్ల నిర్మాణాలు దాదాపు పూర్తి కావస్తున్నాయి. ఇవేగాక అదనంగా మరో 30 ఇళ్లు మంజూరయ్యాయి. రెండు కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.

ఇప్పటికే చాలా వరకు అభివృద్ధి



డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సహకారంతో గ్రామం రూపురేఖలు మారుతున్నాయి. రోడ్లతోపాటు పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పాఠశాలలో నాడు – నేడు పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే సగం అభివృద్ధి జరిగింది. రానున్న కాలంలో సీసీరోడ్లు కమ్ డ్రైనేజీలు పూర్తవుతాయి. ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు కావడంతో తాగునీటి ఇబ్బందులు తొలగిపోయాయి. – పర్రే రామునాయుడు, గాదిరాయి

సొంతింటి కల నెరవేరింది



జగనన్న కాలనీలో స్థలంతోపాటు ఇల్లు మంజూరు కావడంతో సొంతింటి కల నెరవేరింది. ఐదేళ్లపాటు అద్దె ఇంట్లో బాడుగ చెల్లించలేక ఇబ్బందులు పడ్డాం. నాలుగు రోజుల క్రితం జగనన్న కాలనీలో ఇల్లు నిర్మాణం పూర్తి కావడంతో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రారంభించారు. చాలా ఆనందంగా ఉంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జన్మాంతరం రుణపడి ఉంటాం.

– పర్రే సత్యవతి, గాదిరాయి

మారాజు సీఎం జగన్



సీఎం జగన్ పాలనపై డిప్యూటీ సీఎం బూడి వద్ద ఆనందం వ్యక్తం చేస్తున్న వృద్ధురాలు



చౌడువాడలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వద్ద మహిళల ఆనందం
- చౌడువాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

కె.కోటపాడు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం చౌడువాడ గ్రామంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఇంటింటికీ వెళ్లిన క్రమంలో సీఎం జగన్ పాలనపై పలువురు తమ ఆనందాన్ని పంచుకున్నారు. వృద్ధాప్యంలో మాలాంటి వారికి మేలు చేసేలా మారాజు సీఎం జగన్ ఇంటికే పింఛన్లతోపాటు వైద్యులను పంపిస్తున్నారు.₹ అని కుంచా నల్లమారమ్మ, తదితర వృద్ధురాళ్లు ఆనందాన్ని వ్యక్తం చేశారు. పిల్లలకు అమ్మఒడి, వైఎస్సార్ చేయూత లబ్ధితోపాటు సొంతిల్లు మంజూరు చేశారని కొమ్మొజు పార్వతమ్మ కృతజ్ఞతలు తెలిపింది. సినిమాహాల్ పరిసరాల్లో నీటి నీటి సమస్యపై మొరపెట్టుకున్న కొన్ని రోజుల్లోనే చేతిబోరు ఏర్పాటు చేశారని కె.రమణమ్మ, లక్ష్మి, సిహెచ్.సంతోషి, దేముడమ్మ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎటువంటి ఆసరా లేని పేద కుటుంబాల వారికి సొంత నగదును డిప్యూటీ సీఎం అందించారు. ఎస్సీ కాలనీలో 20 వేల మంచినీటి పథకానికి నిధులను వెంటనే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జలజీవన్ మిషన్ భాగంగా రూ.4.68 కోట్లతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కుంచా వారి కళ్లాలకు గ్రావెల్ రోడ్డు నిర్మిస్తామన్నారు. ఎంపీడీవో శచీదేవి, తహసీల్దార్ జె.రమేష్‌బాబు, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆకుల సాయిప్రసాద్, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, వార్డు మెంబర్లు వంటాకు రామునాయుడు, గోవిందరావు, చల్లా సురేష్ పాల్గొన్నారు.

నేడు చుక్కపల్లిలో 'గడప గడపకు'

చీడికాడ: చుక్కపల్లిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, యువజన విభాగం అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహిస్తారన్నారు. పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

వైభవంగా మోదకొండమ్మ ఆలయం ప్రారంభం



మోదకొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల: జంపెనలో నూతన మోదకొండమ్మ ఆలయం ప్రారంభోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో సారె ఊరేగింపు చేపట్టి అమ్మవారికి సమర్పించారు. అనంతరం గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ గురువునాయుడు ఆధ్వర్యంలో గ్రామస్తులు, దాతల సహకారంతో మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. గ్రామస్తులతోపాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలతో మేలు



బుక్ రీడింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న గ్రంథపాలకురాలు సౌమ్య

కె.కోటపాడు: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు మేలు కలగనున్నట్లు గ్రంథపాలకురాలు సౌమ్య అన్నారు. గురువారం కె.కోటపాడు శాఖ గ్రంథాలయంలో బుక్ రీడింగ్‌తోపాటు స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులను నిర్వహించారు. వచ్చే నెల 11 వరకు వేసవి విజ్ఞాన తరగతులను నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

'200 ఉపాధి పనిదినాలు కల్పించాలి'

మాడుగుల రూరల్: ఉపాధి వేతనదారులకు ప్రతీ వారం పే స్లిప్‌లను అందించాలని గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ కార్యదర్శి నరిసింహమూర్తి డిమాండ్ చేశారు. ఉపాధి వేతనదారుల సమస్యలపై గురువారం ఆయన కూలీలతో కలిసి జమ్మాదేవి పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఉపాధి కూలీలకు ఏడాదికి 200 రోజుల పని దినాలను కల్పించాలని కోరారు.

14న విజయాంజనేయ జయంత్యుత్సవాలు

మాడుగుల: స్థానిక గాంధీ పార్కు వద్ద ఈ నెల 14న విజయాంజనేయ జయంతి ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కోలాటాలు, రామాంజనేయ యుద్ధ సన్నివేశంతోపాటు 108 సార్లు హనుమాన్ చాలీసా సంకీర్తన, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రీ సర్వేలో అలసత్వంపై ఆర్డీవో ఆగ్రహం

- పనితీరు మార్చుకోవాలని హెచ్చరిక



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

మాకవరపాలెం: రీ సర్వేలో అలసత్వం చూపుతున్న సిబ్బందిపై నర్సీపట్నం ఆర్డీవో జయరాం ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మెరుగుపర్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. జగనన్న శాశ్వత భూ హక్కు పథకంలో చేపట్టిన రీ సర్వేపై గురువారం మధ్యాహ్నం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం మండలంలో చేపట్టిన రీ సర్వేతోపాటు సరిహద్దు రాళ్ల ఏర్పాటుపై గ్రామాల వారీగా రివ్యూ చేశారు. భూముల రీ సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ ప్రసాదరావు, డిటి కృష్ణమూర్తి, వీఆర్వోలు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లిలో ట్రాఫిక్ ఆంక్షలు



గ్రామ పెద్దల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ నాగేంద్ర

దేవరాపల్లి: గ్రామ దేవత సన్యాసమ్మ అమ్మవారి నెల రోజుల పండగ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ ఆంక్షలను పాటించాలని ఎస్‌ఐ డి. నాగేంద్ర తెలిపారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు ఆధ్వర్యంలో గురువారం దేవరాపల్లిలో గ్రామ పెద్దల సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడారు. 11 ఏళ్ల తర్వాత నిర్వహించనున్న గ్రామదేవత పండగ సందర్భంగా వచ్చే నెల 5, 6 తేదీల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నామన్నారు. పండగకు వేలాదిగా భక్తజనం తరలిరానున్న నేపథ్యంలో గ్రామంలోకి భారీ వాహనాల రాకపోకలను ముందుగా నిలిపివేస్తున్నామని తెలిపారు. దీనికి గ్రామ పెద్దలు, ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితానాయుడు, గండిపడాల అప్పలరాజు, గుండు రాంబాబు, వాలేటి నాగరాజు, వెత్సా రమేష్ పాల్గొన్నారు.

విధులకు హాజరు కాని పారిశుధ్య సిబ్బంది

- కొత్తకోటలో పేరుకుపోతున్న చెత్తాచెదారం

రావికమతం: కొత్తకోట మేజర్ పంచాయతీలో రెండు రోజులుగా పారిశుధ్య సిబ్బంది విధులకు హాజరు కాకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. వీరికి పంచాయతీ సిబ్బంది వేతన బకాయిలను చెల్లించకపోవడంతో విధులకు హాజరు కాలేదు. దీంతో వీధుల్లో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయింది. మాజీ ఉప సర్పంచ్ గున్నాజీరావు ఇంటి వద్ద వాల్వ్ పాడవ్వడంతో గురువారం తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు మంచినీటి కోసం ఇక్కట్లు పడ్డారు. పంచాయతీ అధికారులు, పాలకులు తక్షణమే స్పందించి ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై సర్పంచ్ కోన లోవరాజును సంప్రదించగా పారిశుధ్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశామని, కొంత మొత్తం చెల్లించామన్నారు. శుక్రవారం నుంచి విధుల్లో చేరుతారన్నారు. పాడైన వాల్వ్‌ను అమర్చి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.



గ్రామంలో పారిశుధ్య లోపం



పాడైన వాల్వ్

నేత్ర శస్త్రచికిత్సలకు 27 మంది ఎంపిక



రోగులను పరీక్షిస్తున్న ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి సిబ్బంది

దేవరాపల్లి: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం కొత్తపెంటలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని సర్పంచ్ రొంగలి వెంకటరావు, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ కంచెర్ల నారాయణరావు ప్రారంభించారు. ఈ నేత్ర వైద్య శిబిరంలో విశాఖపట్నం ఎల్.వి. ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆప్తాలమిస్టులు ఆర్. లీలావతి, నేహ, రుషబ్ వంద మందిని పరీక్షించారు. వీరిలో 27 మందిని నేత్ర శస్త్రచికిత్సల నిమిత్తం ఎంపిక చేశారు. మరో 15 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ సభ్యులు వరిగల శంకరరావు, ఎస్. మోహన్‌సతీష్, ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రి ఫీల్డ్ అసిస్టెంట్లు భూపతి, సంతోషి, క్యాంప్ కోఆర్డినేటర్ స్వాములు, టెక్నీషియన్లు వేణు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సీఎం దృఢ సంకల్పంతో సంక్షేమ పాలన



కొండపాలెంలో చిన్నారిని ఎత్తుకున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



టీడీపీ మాజీ ఎంపీపీ సత్యనారాయణను పరామర్శిస్తున్న విప్ ధర్మశ్రీ

- కొండపాలెంలోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను దృఢ సంకల్పంతో అమలు చేస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కితాబిచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం కొండపాలెంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, అధికారులతో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సీఎం జగనన్న పాలన బాగుందని లబ్ధిదారులు తమ ఆనందాన్ని ప్రభుత్వ విప్‌తో పంచుకున్నారు. అనంతరం ధర్మశ్రీ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని సంక్షేమ పథకాలను రాష్ట్రంలోనే ఇస్తున్నామని, అందువల్ల నంబర్‌వన్ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ప్రశంసించారు. జగనన్న పాలన విధానం గురించి పలు రాష్ట్రాలు తెలుసుకుని అనుసరిస్తున్నాయన్నారు. షేక్ రహమాన్ ఇంటి నుంచి కోనపల్లి వరహాలు ఇంటి వరకు డ్రైనేజీ, సీసీరోడ్డు, ముత్యాలమ్మ గుడి నుంచి ప్రధాన రోడ్డు వరకు సీసీరోడ్డు, కోనపల్లి వరహాలు ఇంటి నుంచి మద్దాల రమణ ఇంటి వరకు డ్రైనేజీ ఏర్పాటు చేయాలని, ముచ్చకర్ల శ్రీను ఇంటిపైకి వేలాడుతున్న తీగల వల్ల విద్యుత్తు స్తంభం పక్కకు మార్చాలని, ముత్యాలమ్మ గుడి పక్క నుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ తీగలు ఇళ్లను ఆనుకుని ఉండటం వల్ల ఇటీవల ముచ్చకర్ల సంధ్య షాక్‌కు గురై గాయాలపాలైందని, విద్యుత్ లైన్ ఇళ్లకు దూరంగా మార్చాలని, కమ్యూనిటీ హాలు మంజూరు చేయాలని పలువురు కోరారు. ఈ సమస్యలన్నీ పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్ ధర్మశ్రీ తెలిపారు. అనంతరం టీడీపీ మాజీ ఎంపీపీ సత్యనారాయణను పరామర్శించారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, కోఆపరేటివ్ మాజీ అధ్యక్షుడు గుమ్మిడి రాజునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మిడి చినబాబు, రహమాన్, ముచ్చకర్ల శ్రీను, గుమ్మిడి సింహాద్రి, సెలపరెడ్డి జగన్నాథం, సాలాపు ఈశ్వరరావు, కర్రి దేవుడమ్మ పాల్గొన్నారు.

మూడో విడత రీసర్వేపై ప్రణాళిక



సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్ కనకారావు

నాతవరం: మూడో విడత కింద ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసామని తహసీల్దార్ పి.కనకారావు తెలిపారు. ఆయన గురువారం తన కార్యాలయంలో రీసర్వేపై అధికారులకు పలు సూచనలు చేశారు. దీనివల్ల కలిగే లాభాలపై గ్రామసభల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మండలంలో ఇంతవరకు చొల్లంగిపాలెం, పాట్టినాగన్నదొరపాలెం, కె.వి.శరభవరం, కృష్ణాపురం అగ్రహారం రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి రైతులకు కొత్త పాసుపుస్తకాలు పంపిణీ చేశామన్నారు. మిగతా రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఎక్కడైనా రీసర్వేలో నిబంధనలు ఉల్లఘిస్తే తీవ్ర ఇబ్బందులు ఉంటాయన్నారు. డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, ఆర్ఐ నారాయణరావు, సీనియర్ అసిస్టెంటు డి. కృష్ణ, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

నెలాఖరులోగా గోశాల షెడ్ల నిర్మాణం పూర్తి



కొత్తగా నిర్మించిన గోశాల షెడ్డును పరిశీలిస్తున్న అధికారులు

నాతవరం: గోశాల షెడ్ల నిర్మాణాలు ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. మండలంలో ఉపాధి హామీ సిబ్బందితో కలిసి గురువారం ఆయన పలు గ్రామాల్లో వీటి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలానికి మొదట విడత కింద 45 గోశాల షెడ్లను మంజూరు చేశామన్నారు. అందులో 24 షెడ్లను నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టరు ఆదేశించారన్నారు. గోశాల షెడ్డు విస్తీర్ణం బట్టి రూ.1.80 లక్షల నుంచి రూ.3 లక్షల లోపు నిధులు ఇస్తామన్నారు. నిబంధనల ప్రకారం నిర్మాణాలు పూర్తి చేసిన రైతుల ఖాతాలో నగదు జమ చేస్తున్నామన్నారు. సకాలంలో నిర్మించకపోతే షెడ్డు రద్దు చేస్తామన్నారు. ఉపాధి ఏపీవో చిన్నారావు, టెక్నికల్ అసిస్టెంటు దేముడు, సచివాలయ పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నాగ దుర్గాలమ్మ పండగ

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక పూజలు



గంగిరెద్దు ప్రదర్శనను తిలకిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు: కె.సంతపాలెంలో గ్రామదేవత నాగ దుర్గాలమ్మ పండగ గురువారం ఘనంగా జరిగింది. ఐదేళ్లకోమారు నిర్వహించే అమ్మవారి పండగను సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులంతా ఐక్యతతో పండగను జరుపుకోవడం ఆనందంగా ఉందని డిప్యూటీ సీఎం అన్నారు. సర్పంచ్ చల్లా మంగ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.